సాక్షి ప్రకాశం
గురువారం । 26 । జూన్ । 2025



మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలి

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. - 8లో..



సన్నిహితుడే కాలయముడు

మర్రిపూడి విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ హత్య కేసు మిస్టరీ వీడింది. నిందితుని వివరాలను డీఎస్పీ వెల్లడించారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వీఆర్‌ఏలపై అదనపు భారం తగదు



సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

ఒంగోలు టౌన్: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా అదనపు భారంతో అల్లాడిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గెంటెనపల్లి శ్రీనివాసులు విమర్శించారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణ తరహాలో టైం స్కేలు జీతాలు, డీఏని కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వీఆర్‌ఏ సంఘం జిల్లా నాయకురాలు పి.జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక వీఆర్‌ఏలకు టైం స్కేలు జీతాలు, ప్రమోషన్స్, డీఏని జీతంతో కలపడం లాంటివి చేయకుండా అదనపు భారంతో వేధిస్తోందని మండిపడ్డారు. ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు, సర్వే డ్యూటీలు వంటి అదనపు భారం వేయడంతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు భారం వేసినా టీఏలు, డీఏలు చెల్లించకపోవడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ మొత్తాన్ని రద్దు చేయాలని, వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. జులై 9వ తేదీ జరిగే సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. ఈ ధర్నాలో దానం, వి.యేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చలో తెనాలిని జయప్రదం చేయండి



'చలో తెనాలి' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాలు

ఒంగోలు టౌన్: దళిత మైనారిటీ యువకుల మీద పోలీసుల అరాచకాన్ని ఖండిస్తూ ఈ నెల 28వ తేదీ తెనాలిలో నిర్వహించనున్న మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం వద్ద బుధవారం ×చలో తెనాలి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ తెనాలిలో నడిరోడ్డు మీద దళిత మైనారిటీ యువకులను పోలీసులు చిత్రహింసలు పెట్టడం ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి దళిత మైనారిటీ యువకులపై బహిరంగ ప్రదేశంలో దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో మానవ హక్కులు కాపాడుకోవాలని కోరారు. పోలీసు చర్యలను మంత్రులు సమర్థిస్తూ మాట్లాడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పోలీసుల బహిరంగ దాడిని సమర్థించిన హోం మంత్రి వంగలపూడి అనిత, ఎస్పీ సతీష్ కుమార్‌లపై జాతీయ మానవ హక్కుల వేదిక తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రజలందరూ ముక్త కంఠంతో ఖండించాలన్నారు. చలో తెనాలి కార్యక్రమాన్ని హక్కుల సంఘాలు, దళిత మైనారిటీ సంఘాలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భీమవరపు సుబ్బారావు, పెద్దన్న, తన్నీరు వెంకటస్వామి, పిన్నిక శ్రీనివాస్, ఆనాల వెంకటరావు, ఆంజనేయులు, గాలి సంగీతరావు, దాసి సుందరం, కె.పేరయ్య, టి.వెంకటస్వామి ,లింగ వెంకటేశ్వర్లు , నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

మార్కాపురం టౌన్: ఈనెల 29వ తేదీన ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో 10 బహుళజాతి కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి రవితేజ యాదవ్ బుధవారం తెలిపారు. మార్కాపురం నియోజకవర్గంతోపాటు జిల్లాలోని 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉన్న పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎస్కే ఫిరోజ్‌గాంధీ 70139 50097 నంబరును సంప్రదించాలన్నారు.

జూలై 9న దేశ వ్యాప్త సమ్మె



ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు సబర్బన్: కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఒంగోలు నగర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె. వెంకటేశ్వరరావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఒంగోలు నగర్ కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్ కార్మికులు జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని మున్సిపల్ కార్మికులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనం పథకంతో సహా అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్, ఎం.ఆర్ బదిలీ కోవిడ్, క్లబ్ డ్రైవర్‌కు జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. డెత్, సిక్, అప్కాస్ ద్వారా రిటైర్మెంట్ చేసిన కార్మికుల పిల్లలకి ఉద్యోగాలు ఇవ్వాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి. నరసింహ, టి.విజయమ్మ, నాయకులు కె.సామ్రాజ్యం, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాటల్లో కొనుగోలు.. కోలుకోని ధరలు!

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించేశాం..పొగాకు కొనేస్తున్నాం..రైతులకు మంచి ధర ఇస్తున్నాం.. అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పలువురు మంత్రులు ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజురోజుకూ ధరలు పతనమవుతున్నాయి. బయ్యర్ల మాయాజాలానికి రైతు కుదేలవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బుధవారం వివిధ వేలం కేంద్రాల్లో కనిష్ఠ ధర రూ.160కి పడిపోయింది. ఈ ఒక్క రోజే దాదాపు 3 వేల బేళ్లను తిరస్కరించారు.

- పడిపోతున్న పొగాకు కనిష్ట ధరలు
- మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించామంటూ హడావుడి
- ధరల పెరుగుదలలో కానరాని మార్పు
- కేజీ పొగాకు కనిష్ట ధర రూ.160 కి పతనం
- పెరుగుతున్న తిరస్కరణకు గురవుతున్న బేళ్ల సంఖ్య
- బుధవారం ఒక్కరోజే 3 వేల బేళ్లు వెనక్కి
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు
- నాలుగు నెలలు దాటుతున్నా 52 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోళ్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ధరల కోసం రైతులు ఆందోళన చేశారు. పొగాకు బేళ్లను దగ్ధం చేసి నిరసనలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలికి వచ్చి పొగాకు రైతులను పరామర్శించారు. జగన్ పొదిలి పర్యటనకు వచ్చిన స్పందనను చూసి పాలక పక్షం గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వ్యవసాయశాఖ మంత్రి మార్క్‌ఫెడ్ కేంద్రాలను ప్రారంభించేశాం రైతులకు మంచి ధర వస్తుందంటూ ప్రకటనలు చేశారు. నాలుగు రోజులుగా రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో అమ్మకాలు జరుగుతున్న తీరును ఒక్కసారి పరిశీలిస్తే ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. కనిష్ఠ ధరలు రోజు రోజుకూ పతనమవుతున్నాయి. జిల్లాలోని పలు వేలం కేంద్రాల్లో బుధవారం పొగాకు కొనుగోళ్లు కనిష్ఠ ధర కేవలం రూ.160 వద్ద పలికింది. గరిష్ట ధర ఏదో మొక్కుబడిగా 10–15 బేళ్లకు మాత్రం రూ.280 చూపిస్తున్నారు. దాదాపు 70 శాతం పొగాకు బేళ్లకు కనిష్ఠ ధరతోనే రైతులు సర్దుకోవాల్సి వచ్చింది. బుధవారం కొనుగోలు చేసిన బేళ్ల వివరాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. నల్లరేగడి నేలలకు సంబంధించిన వేలం కేంద్రాలు వెల్లంపల్లి-2, ఒంగోలు-1, 2, టంగుటూరు-1, కొండపికి మొత్తం 5,452 బేళ్లు రాగా వాటిలో నోబిడ్ పేరుతో 1558 బేళ్లను తిరస్కరించారు. కొనుగోలు చేసిన బేళ్లకు కనిష్ఠ ధర రూ.160, గరిష్ఠ ధర రూ.280 పలికింది. సరాసరి ధర రూ.233.24 పలికింది. అదే విధంగా తేలికరకం నేలలు కలిగిన వేలం కేంద్రాలైన పొదిలి-1, కనిగిరి, కందుకూరు-1,2, కలిగిరి, డీసీపల్లిలో 5,394 బేళ్లు రాగా వాటిలో 1437 బేళ్లను తిరస్కరించారు. మిగిలిన బేళ్లకు కనిష్ఠ ధర రూ.160, గరిష్ఠ ధర రూ.280, సరాసరి ధర రూ.232.08 పలికింది.



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

52 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు

ఈ సంవత్సరం మార్చి10వ తేదీన జిల్లాలో పొగాకు వేలం ప్రారంభమైంది. నాలుగు నెలలు దాటుతున్నా కేవలం 52 మిలియన్ కేజీల పొగాకును మాత్రమే కొనుగోలు చేశారు. ఈ ఏడాది రైతులు 69,095 హెక్టార్లలో పొగాకును సాగు చేశారు. బోర్డు అధికారులు అధికారికంగా ఈ ఏడాది 104 మిలియన్ కేజీలను కొనుగోలు చేసేందుకు అనుమతినిచ్చింది. కానీ రైతులు 160 మిలియన్ కేజీల వరకు పండించినట్లు అధికారుల అంచనా. గత ఏడాది 88.69 మిలియన్ కేజీలను కొనుగోలు చేసేందుకు అనుమతినిచ్చినా అంతకు మించి 154.41 మిలియన్ కేజీలు కొనుగోలు చేశారు. దానితో పాటు గరిష్ఠ ధర రూ.366 పలికింది. కానీ ఈ సంవత్సరం కనిష్ఠ ధర రూ.160 పలుకుతుండటంతో రైతులు ఏం చేయాలో తెలియక పెట్టిన పెట్టుబడులు రావడమే కనాకష్టంగా ఉందని వాపోతున్నారు. ఒక్కో బ్యారన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు నష్టాలను మూటగట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి కొనుగోలు చేసిన పొగాకు 45 శాతం మించకపోవడంతో ఇంకా మిగిలిన పొగాకు కొనుగోళ్లలోనైనా గిట్టుబాటు ధరలు వస్తాయేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ రైతులు ఆక్రందనలు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటికే ఇద్దరు పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

పెరుగుతున్న రిటన్ బేళ్ల సంఖ్య..



పొదిలిలో.. రిటన్ బేళ్లను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

పొదిలి వేలం కేంద్రంలో రోజు రోజుకూ రిటన్ బేళ్ల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక వైపు ధరలు లేక రైతులు దిగాలు పడుతుండగా మరో వైపు రిటన్ బేళ్లతో మరింత గుబులు పడుతున్నారు. బుధవారం వేలానికి 1197 బేళ్లు వచ్చాయి. వాటిలో 620 మాత్రమే కంపెనీల వారు కొనుగోలు చేశారు. పలు కారణాలతో 580 తిరస్కరణకు గురయ్యాయి. వీటిలో 499 బేళ్లు నోబిడ్‌గా తిరస్కరించారు. 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొన్నారు. కనిగిరి బోర్డులో బుధవారం సీతారంపురం (తురకపల్లి) క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు 705 బేళ్లను యార్డుకు తెచ్చారు. అందులో 365 బేళ్లు కొనుగోలు చేయగా, 340 పొగాకు బేళ్లను తిరస్కరించారు. ఈ కేంద్రం పరిధిలో ఇప్పటి వరకూ 3.1 మిలియన్ కేజీల పొగాకును మాత్రమే కొనుగోలు చేశారు. కొండపి వేలం కేంద్రానికి వెన్నూరు చిన్న వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 965 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 687 బేళ్లు కొనుగోలయ్యాయి. 278 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 24 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే టంగుటూరు కేంద్రానికి వేలం కేంద్రానికి దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకి చెందిన రైతులు వేలానికి 895 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 690 కొనుగోలు చేశారు. 205 పొగాకు బేళ్లు తిరస్కరించారు.

6 రౌండ్లు పూర్తయినా లభించని గిట్టుబాటు ధర

కొండపి: కొండపి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం ఆరో రౌండ్ పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి 7వ రౌండ్ కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఇప్పటి వరకు వేలం కేంద్రంలో 6.24 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయి. ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర లభించక కూలీలకు, కౌలు ఇంత వరకు నగదు చెల్లించలేదని రైతులు వాపోతున్నారు. రైతుల దగ్గర ఉన్న లో గ్రేడు పొగాకును రూ.180 నుంచి రూ.160కి తగ్గించిన వ్యాపారులు ఆ ధరకు కూడా నామమాత్రంగా బేళ్లను కొనుగోలు చేసి ఎక్కువ భాగం తిప్పి పంపుతున్నారు.

ఒకే రోజు పొగాకు కేజీకి రూ.20 తగ్గింపు

టంగుటూరు: పొగాకు వేలం కేంద్రంలో ఒకే రోజు కనిష్ఠ ధర రూ.20 తగ్గించి కేజీ రూ.160కి వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రైతులు విస్మయం వ్యక్తం చేశారు. అసలే ఈ ఏడాది నష్టాలు పాలవుతున్నామని, దీనికి తోడు రోజు రోజుకీ ధరలు దిగజారుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 205 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ వేలంలో మొత్తం 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన నాయకులను వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా యర్రగొండపాలేనికి చెందిన ఉడుముల అరుణ, రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ గా ఒంగోలుకు చెందిన ఆళ్ల రవీంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా కనిగిరికి చెందిన పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, రాష్ట్ర ఆర్టీఐ వింగ్ జనరల్ సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన కడప వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టీఐ వింగ్ సెక్రటరీలుగా ఒంగోలుకు చెందిన సానికొమ్ము రామిరెడ్డి, సంతనూతలపాడుకు చెందిన మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీగా యర్రగొండపాలెంకు చెందిన అబ్దుల్ మజీద్, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన గుర్రం వెంకట లక్ష్మీ రెడ్డిలను నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఒంగోలు సబర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంతో అధికారులు కృషి చేయాలని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. జిల్లాలో భూసార పరీక్షల్లో భాగంగా 34,293 మట్టి శాంపిల్స్ లక్ష్యంగా కాగా వంద శాతం సాధించారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 46,015 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు లక్ష్యం కాగా, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యం మేరకు కార్డుల మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ బొల్లిపల్లి రవి కుమార్, మత్స్య శాఖ జేడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి


ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, దద్దాల నారాయణయాదవ్


బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కదిరి బాబూరావు


మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్


ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, కరణం వెంకటేష్


మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చంద్రబాబు మోసాన్ని ఎండగట్టాలి

వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ముఖ్య నేతల సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన నాయకులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం హామీలు విస్మరించి మోసగిస్తున్న తీరును ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పార్టీ నాయకులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. ఏడాది పరిపాలనలో చంద్రబాబు వల్ల ప్రతి కుటుంబానికి ఎంత నష్టం జరిగింది, ఇక మీదట జరగబోయే నష్టం ఎంత? వైఎస్సార్ సీపీ అధికారంలో ఉంటే ఎంత మేర లబ్ధి చేకూరేదో వివరిస్తూ కూటమి మేనిఫెస్టోను రీకాల్ చేయాలని సూచించారు.

అమ్మనబ్రోలులో పోలీసుల సోదాలు


సిద్ధాంతి ఇంట్లో పోలీసుల సోదాలు

ఒంగోలు టౌన్/నాగులుప్పలపాడు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మొదటి రోజు మంగళవారం కొప్పోలులో బొర్లగుంట వినోద్‌కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు బుధవారం రెండో రోజు అమ్మనబ్రోలులోని ఆళ్ల సాంబశివరావు అలియాస్ సిద్ధాంతి ఇంట్లో సోదాలు నిర్వహించారు. నాగులప్పలపాడు ఎస్సై షేక్ రజియా సుల్తానా, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌కుమార్‌తో కలిసి ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అమ్మనబ్రోలులోని ఆళ్ల సాంబశివరావు ఇంటికి వచ్చారు. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ముప్ప సురేష్‌ను పోలీసులు ప్రధాన నిందితుడని చెబుతున్నారు. ముప్ప సురేష్‌కు స్వయాన మేనమామ సాంబశివరావు ఇంట్లో ముద్దాయిలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ప్రామిసరీ నోట్లు, ఇతరా కీలకమైన పత్రాలు, ఖాతాల వివరాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించారు. అలాగే ముప్ప సురేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను విచారించారు. మరో రెండు రోజుల పాటు ఈ విచారణ కొనసాగుతుంది. 27వ తేదీ సాయంత్రంతో నిందితుల పోలీసు కస్టడీ ముగియనుంది. ఇదిలా ఉండగా ముప్ప సురేష్ ఉన్నత న్యాయస్థానంలో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. కోర్టులో విచారణ శుక్రవారానికి వాయిదా పడినట్లు సమాచారం.

మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్


పదోన్నతి పొందిన వారితో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగానికి చెందిన ఆరుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా, నలుగురు ఏఎస్‌లకు ఎస్ఐలుగా పదోన్నతి ఉత్తర్వులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రజలు పోలీసులపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని, ఉన్నతాధికారులు మన్ననలు పొందాలని చెప్పారు. వివిధ ఫిర్యాదులతో పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులకు అండగా నిలబడాలని, విధి నిర్వాహణలో శాఖాపరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏవో రామ్మోహన్‌రావు, ఏఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, డీపీఓ సిబ్బంది రవికిరణ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

ఒంగోలు టౌన్: ఒంగోలు-కరవది రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి వృద్ధుడు దుర్మరణం చెందాడు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్-3లో తిన్సుకియ నుంచి తంబరం వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని 65 ఏళ్ల వృద్ధుడు జారి పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. తెలుపు రంగు చొక్కాపై మెరున్ కలర్ డిజైన కలిగిన ఫుల్ హ్యాండ్ షర్ట్, గ్రే కలర్ షార్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సమాచారం తెలిసిన వారు 94406 27647 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్సై కె.మధుసూదన్‌రావు సూచించారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: మాదకద్రవ్య రహిత సమాజాన్ని సాధించేందుకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఈ దిశగా విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ అంతర్జాతీయ మాదకద్రవ్య రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టే కార్యక్రమ నిర్వహణపై ఎస్పీ ఏఆర్ దామోదర్‌తో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. దీనికి అనుబంధంగా అన్ని జిల్లాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున జిల్లా కేంద్రం ఒంగోలులో గురువారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం అక్కడి నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు ప్రత్యేక ర్యాలీ ఉంటుందని వివరించారు. విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆశా వర్కర్లు, ఇతర ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలను ర్యాలీలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ దిశగా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ర్యాలీలో పాల్గొనే వారికి అవసరమైన ముందస్తు వైద్య సాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందుకోసం చేయాల్సిన ఏర్పాట్లపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మధ్యాహ్నం నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, నగరంలో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు విధించాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే పదార్థాలను వివరించేలా రూపొందించిన పోస్టర్లను, నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పేరు, ఇతర వివరాలు నమోదు చేస్తే డ్రగ్స్ వినియోగ వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సర్టిఫికెట్ జనరేట్ అవుతుందన్నారు. సమావేశంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, మెప్మా పీడీ శ్రీహరి, డీఆర్డీఏ పీడీ నారాయణ, ఎక్సైజ్ ఎస్ఈ ఆయేషా బేగం, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీటీసీ సుశీల, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి, డీఈవో కిరణ్‌కుమార్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీసీపీఓ దినేష్‌కుమార్, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మహిళా పీఎస్ డీఎస్పీ రమణ కుమార్, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సన్నిహితుడే కాలయముడు

● మర్రిపూడిలో కంప్యూటర్ ఆపరేటర్ హత్యకు స్వలింగ సంపర్కమే కారణం
● సంబంధం వదిలించుకునేందుకే ఘాతుకం
● హత్యలో ప్రధాన నిందితుడి ప్రియురాలి హస్తం ఉందని తేల్చిన పోలీసులు
● కేసు వివరాలు వెల్లడించిన కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్



హత్యకు ఉపయోగించిన కారు

మర్రిపూడి: స్థానిక విద్యాశాఖ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కోలా రాజశేఖర్ (35) హత్య కేసు మిస్టరీని పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఈ నెల 18న ఆయన హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు జగన్నాథం జయసింహగా కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వత్ వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. రాజశేఖర్ గే. ఆయనకు పొదిలికి చెందిన జగన్నాథం జయసింహతో ఏడాదిన్నర నుంచి స్వలింగ సంపర్క సంబంధం ఉంది. తొలుత ఎవరికీ తెలియకుండా ఇద్దరూ సంబంధం కొనసాగించారు. కేరళ రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసించిన జయసింహ ఒంగోలులో ఫిషరీస్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ చెడు అలవాట్లకు బానిసై ఉద్యోగం మానేశాడు. చెడుతిరుగుళ్లు తిరుగుతూ దర్శికి చెందిన వివాహిత పల్లా అనూషాతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇది రాజశేఖర్‌కు నచ్చలేదు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. రాజశేఖర్‌ను ఎలాగైనా వదిలించుకోవాలని భావించిన జయసింహ తనతో చనువుగా మెలుగుతున్న అనూషాతో కలిసి హత్యకు పథకం రచించాడు. చివరిగా ఒకసారి తనతో శారీరకంగా కలిస్తే వాట్సప్ గ్రూపులో అసభ్యకర పోస్టులు పెట్టనని జయసింహతో రాజశేఖర్ చెప్పాడు. ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై రాజశేఖర్ బయటకు వచ్చాడు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో అల్పాహారం పార్శిల్ చేయించుకుని శ్రీలక్ష్మీనృంహస్వామి కొండ వైపు వెళ్లాడు. అప్పటికే అక్కడ జయసింహ, అనూష ఉన్నారు. కాసేపటికే వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు చోటుచేసుకుంది. రాజశేఖర్‌ను కింద పడేసి అతి కిరాతకంగా కారుతో ఢీకొట్టి చంపారు. ఈ దాడిలో రాజశేఖర్ మర్మాయవాలు తెగిపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత హంతకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మృతుడి ఫోన్‌కు చివరిగా వచ్చిన కాల్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికతను ఉపయోగించి కేసును ఛేదించారు. హంతకులను పొదిలి కొండ సమీపంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కొండపి సీఐ సోమశేఖర్, మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఇప్పటికైనా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

● ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోందని, రాబోయో సంవత్సర కాలంలోనైనా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి కోరారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) 36వ రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల వేతన సవరణ చట్టం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతన సవరణ జరిగి 15 ఏళ్లు అవుతోందని, దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు. సభకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. తొలుత ప్రకాశం భవన్ నుంచి విష్ణుప్రియ కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఐజేయూ జనరల్ సెక్రటరీ బల్వీందర్ సింగ్ జమ్ము, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్ఎన్ సిన్హా, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ ప్రధానం

● పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలి
● స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సమీక్షలో జిల్లా కలెక్టర్

ఒంగోలు సబర్బన్: పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా శ్రద్ధ తీసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, 0-6 ఏళ్ల పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణాల పురోగతి, పౌష్టికాహారం పంపిణీ తీరుపై సమీక్షించారు. మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీఓ దినేష్ కుమార్‌తో పాటు సీడీపీఓలు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన పోలీసులు


రఫీకి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

కంభం: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ వ్యక్తిని కంభం ఎస్సై నరసింహారావు తమ సిబ్బందితో కలిసి రక్షించారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. కంభం పంచాయతీలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ రఫీ మద్యం మత్తులో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రఫీని అదుపులోకి తీసుకున్నారు. కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సీతారామలక్ష్మణులను ఎత్తుకెళ్లారు హనుమంతుడిని వదిలేశారు!

● పురాతన రామాలయంలో మూడు పంచలోహ విగ్రహాలు చోరీ!
● కంభం మండలం తెల్లదిన్నె గ్రామంలో దుండగుల దుశ్చర్య
● హనుమంతుడి విగ్రహం ఇత్తడిదని పురావస్తు ల్యాబ్ నివేదిక


అపహరణకు గురైన సీతారామలక్ష్మణుల విగ్రహాలు(ఫైల్)


దొంగలు వదిలేసి వెళ్లిన ఆంజనేయస్వామి విగ్రహం

కంభం:

రామాలయంలో దొంగలు పడి పంచలోహ విగ్రహాలను అపహరించిన ఘటన కంభం మండలంలోని తెల్లదిన్నె గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. తెల్లదిన్నె గ్రామంలోని రామాలయంలో సోమవారం సాయంత్రం దీపారాధన నిర్వహించి గుడి తలుపులు మూశారు. మంగళవారం ఉదయం తాళం పగలగొట్టి ఉండటంతో స్థానికులు లోపలికి వెళ్లి చూడగా సీతారామ లక్ష్మణుల పంచలోహ విగ్రహాలు కనపడలేదు. కేవలం హనుమంతుడి విగ్రహం మాత్రమే అక్కడ ఉంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు పరిశీలించి వివరాలు సేకరించారు. మార్కాపురం క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు.

హనుమంతుడిని ఎందుకొదిలేసినట్టు?

తెల్లదిన్నెలో రామాలయాన్ని 91 ఏళ్ల క్రితం నిర్మించారు. గ్రామానికి చెందిన చీరెళ్ల కోటమ్మ పంచలోహాలతో సీతారామలక్ష్మణుల విగ్రహాలు తయారు చేయించి ప్రతిష్ఠించారని స్థానికులు చెబుతున్నారు. చోరీకి వచ్చిన వారు ఆంజనేయ స్వామి ప్రతిమను వదిలేసి మిగిలిన మూడు విగ్రహాలు తీసుకెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంపై పూర్తి అవగాహన ఉన్నవారే దోపిడీకి తెగబడి ఉంటారన్న చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా దొంగలు వదిలేసిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని మార్కాపురంలోని పురావస్తు ల్యాబ్‌లో తనిఖీ చేయించగా అది ఇత్తడితో చేసినట్లు తేలిందని ఎస్సై తెలిపారు. అపహరణకు గురైన విగ్రహాలు ఇత్తడివా లేక పంచలోహాలతో చేసినవా అనేది దొంగలు దొరికితేనే తేలనుంది.